
మానకొండూర్: ఓటింగ్ సరళిని పరిశీలించడానికి వస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి


చిగురుమామిడి: ఓటుహక్కు వినియోగించుకున్న ఎంపీపీ, తదితరులు


శంకరపట్నం: కన్నాపూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

# ముగిసిన పోలింగ్

**నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు • అల్గునూర్‌లో ఓటేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**


చెంజర్లలో ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగురాలు బుర్ర స్వరూప


చిగురుమామిడి: రేకొండలో పోలింగ్ కేంద్రం వద్ద మహిళల బారులు


తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


మానకొండూర్: వృద్ధురాలిని ఓటు వేయడానికి కేంద్రానికి తీసుకువస్తున్న ఆమె కుటుంబ సభ్యులు

తిమ్మాపూర్/ మానకొండూర్/రూరల్/ శంకరపట్నం/గన్నేరువరం/ తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 30: మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆయా మండలాల్లో అధికారులు పోలింగ్ పకడ్బందీగా నిర్వహించారు. సాయంత్రం మూడు గంటల వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 63శాతం ఓటు శాతం నమోదైంది. ఉదయం పోలింగ్ ప్రారంభమైన 7గంటల నుంచే గ్రామాల్లో తండోపతండాలుగా ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం వరకే ఓటింగ్ భారీగా జరిగింది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అధికారులు అన్ని వసతులు ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. పర్లపల్లి, పోరండ్ల, రామకృష్ణకాలనీ గ్రామాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ అల్గునూర్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

మానకొండూర్ మండల వ్యాప్తంగా 78 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. మానకొండూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు.

మానకొండూర్ మండల పరిధిలోని 78 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచే ఓటర్లు బారులు తీరారు. అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మానకొండూర్ సీఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పహారా కాశారు. కేంద్రాల్లో వృద్ధులు, వికలాంగులకు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వికలాంగులను వీల్ చైర్‌లో తీసుకొచ్చేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు పోలీసులు సాయం చేయడంతో పలువురు అభినందించారు. కేంద్రాల్లో వైద్య సిబ్బందిని సైతం ఏర్పాటు చేశారు. మానకొండూర్‌లో ప్రశాంతంగా పోలింగ్‌ను పూర్తి చేశారు.

శంకరపట్నం మండలంలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు మొదట మందకొడిగా కేంద్రాలకు వచ్చారు. ముత్తారం, తదితర గ్రామాల్లో అక్కడక్కడ కొద్దిసేపు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు మొరాయించాయి. దీంతో పోలింగ్ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్, తాడికల్, కేశవపట్నం, తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కేశవపట్నం 108 పోలింగ్ కేంద్రంలో మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. అక్కడ ఉదయం ఓటు వేయడానికి మొదట వచ్చిన మహిళా ఓటర్లను బీఎల్‌వోలు పసుపు, కుంకుమ, పూలు, గాజులతో ప్రత్యేకంగా గౌరవించి పోలింగ్ కేంద్రంలోకి ఆహ్వానించారు. కన్నాపూర్ పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకునుటకు ఓటర్లు బారులు తీరారు. కన్నాపూర్, తదితర గ్రామాల్లో ఓ శతాధిక వృద్ధురాలితో పాటు వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కొత్తగా ఓటు హక్కును పొందిన యువతులు ఉత్సాహంగా మొదటిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగట్టులో ఇరు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొనగా పోలీసులు వారిని చెదరగొట్టారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో బందోబస్తు చేట్టారు.

గన్నేరువరం, నవంబర్ 30: మండలంలో 16 గ్రామపంచాయతీలో 17,920 మంది ఓటర్లు ఉండగా, 15057 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 84.02 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. స్వల్ప ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరిశీలించారు.

తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు కేంద్రాల వద్ద బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఓటర్లకు వసతులు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**చిగురుమామిడిలో..**

చిగురుమామిడి, నవంబర్ 30: హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని చిగురుమామిడి మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చిగురుమామిడి, ములుకనూర్ గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాలను బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ పరిశీలించారు. ములుకనూర్, ఇందుర్తి, చిగురుమామిడి తదితర గ్రామాల్లో మహిళలు గంటల తరబడి ఓటుకోసం క్యూలో నిలుచున్నారు. ములుకనూర్‌లో ఓటువేసేందుకు పసి పిల్లలతో తరలివచ్చారు. చిగురుమామిడిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య స్వల్ప వాగ్వాదం జరుగగా, జడ్పీటీసీ గీకురు రవీందర్‌ను పోలింగ్ ముగిసే వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. చిగురుమామిడిలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పన్యాల భూపతిరెడ్డి, ఎంపీపీ కొత్త వినీతా, బీఆర్ఎస్ నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఆకవరం భవాని ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ రాజేశ్ బందోబస్తు నిర్వహించారు.


చిగురుమామిడి: రేకొండలో ఓటుహక్కును తొలిసారి వినియోగించుకున్న ఇద్దరు అక్కాచెల్లెలు


చిగురుమామిడి: ములకనూర్‌లో బారులు తీరిన ఓటర్లు


తిమ్మాపూర్ రూరల్ : రామకృష్ణకాలనీలో ఓటరుకు బీపీ చూస్తున్న ఏఎన్ఎం రాణి


చిగురుమామిడిలో ఓటుహక్కు వినియోగించుకున్న టీఎస్‌టీడీసీ మాజీ చైర్మన్ భూపతిరెడ్డి


శంకరపట్నం: రాజాపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన యువతులు



చిగురుమామిడి: ములుకనూర్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు చంటిపిల్లలతో వచ్చిన మహిళలు

## ఎన్నికల నిబంధన ఉల్లంఘించిన ఒకరిపై కేసు

మానకొండూర్ రూరల్, నవంబర్ 30: మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన గోపు బుజేందర్ రెడ్డి అనే వ్యక్తి ఎన్నికల్లో భాగంగా గురువారం ఓటు వేసేందుకు వెంట సెల్‌ఫోన్ తీసుకెళ్లి తాను ఓటు వేస్తున్న ఫొటోను తీసుకొని సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఇది వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారడంతో రంగంలోకి దిగిన ఎంసీసీ టీం ఇన్‌చార్జి, మానకొండూర్ ఏఈఈ అక్కపెల్లి సునంద, మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడంతోపాటు ఓటు వేస్తున్న దృశ్యాన్ని ఫొటో తీసి గ్రూపుల్లో చేసినందుకు గోపు బుజేందర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు సునంద తెలిపారు.